నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 5 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి హంసవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

# యాదగిరీశుడికి హంస వాహన సేవ

యాదగిరిగుట్ట, మార్చి4 : యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం తెల్లవారు జామున ప్రధానాలయంలో ద్వారతోరణ పూజ, ధ్వజ కుంభా రాధన, అగ్ని ఆరాధన, మూల మంత్ర, పంచసూక్త హవనం పూజలు నిర్వహించారు. అలంకార సేవోత్సవంలో భాగంగా లక్ష్మీనరసింహ స్వామిని వంట పత్రశాయి అలంకారంలో ప్రత్యేక పల్లకిపై అధిష్ఠించారు. రుత్వికులు, వేదపండితులు స్వామివారి అలంకార సేవ ముందు దివ్య ప్రబంధ వేద పారాయణాలు, మూల మంత్రజప పఠనాలు చేశారు. అనంతరం సన్నాయి మేళంతో స్వామివారిని ప్రధానాలయ తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పు మాఢవీధుల్లో ప్రత్యేక వేంచేపు మండపంలో ఆస్థానం చేసి ప్రధానార్చకులు వటపత్రశాయి విశిష్టతను భక్తులకు వినిపించారు. సాయంత్రం లక్ష్మీనరసింహ స్వామిని హంస వాహనంపై అధిష్ఠింపజేసి తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు.

కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్య నిర్వహణాధికారి భాస్కర్ రావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వేంకటాచార్యులు, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు, పారాయణికులు, రుత్వికులు, సహాయ కార్యనిర్వహణాధికారులు, పాల్గొన్నారు. గురువారం లక్ష్మీనరసింహ స్వామి శ్రీకృష్ణాలంకరణ సేవలో(మురళీకృష్ణుడు) భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం పొన్నవాహన సేవలో ఊరేగనున్నారు.



హైదరాబాద్ ప్రజాభవన్ ఎదుట ప్లకార్డులు పట్టుకొని ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచులు

# మాజీ సర్పంచుల అరెస్టు

భూదాన్ పోచంపల్లి, మార్చి 4 : పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు మంగళవారం హైదరాబాద్ ప్రజా భవన్ ముట్టడికి యత్నించారు. 'మాకు న్యాయం చేయాలి.. బిల్లులు ఇప్పించాలి' అని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. దాంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో భూదాన్ పోచంపల్లి మండల మాజీ సర్పంచ్ మన్నె పద్మారెడ్డితోపాటు పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

# ఆలోచింపజేసిన ఆవిష్కరణలు

## యాదగిరి గుట్టలో ఉమ్మడి జిల్లా స్థాయి సృజన టెక్ ఫెస్ట్

యాదగిరిగుట్ట, మార్చి4 : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఎలక్ట్రికల్ విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి సృజన టెక్ ఫెస్ట్-2025 జరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాగార్జున్‌సాగర్, యాదగిరిగుట్ట, నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. యాదగిరిగుట్ట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 'వాయిస్ కంట్రోల్డ్ వీల్‌చైర్' ప్రాజెక్టును.. నాగార్జునసాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 'ఆటో ఓల్ట్ క్రూయిజ్' ప్రాజెక్టును.. నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు 'డిజైన్ ఆఫ్ ఆన్ ఆటోమెటికల్లి రీచార్జ్ పవర్ యూనిట్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్' ప్రాజెక్టును ప్రదర్శించారు.

ఇందులో ప్రథమ స్థానంలో నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాల నిలిచింది. దీనిని రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్-2025 ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు యాదగిరి గుట్ట ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పి. రాజగోపాల్‌రెడ్డి, మెకానికల్ శాఖాధిపతి రామానాయుడు, జనరల్ సెక్షన్ సీనియర్ స్టాఫ్ సాయిరాం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# 134 మంది పంచాయతీ కార్యదర్శులకు చార్జ్ మెమోలు

- వివరణ ఇవ్వాలని ఆదేశించిన డీపీఓ
- ఇప్పటికే 123 మందికి షోకాజ్ ఇచ్చి బదిలీలు చేసిన యంత్రాంగం
- సమాచారం లేకుండా దీర్ఘకాలం సెలవు పెట్టడంతో చర్యలు

నల్లగొండ, మార్చి 4 : సమాచారం లేకుండా విధులు బహిష్కరించారనే కారణంతో 134 మంది పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నల్లగొండ జిల్లా పంచాయితీ అధికారి వెంకయ్య చార్జ్ మెమోలు జారీ చేశారు. ఇప్పటికే కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ ఏడాది జనవరి 17న 99 మంది, అంతకుముందు 24 మంది మొత్తం 123 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వటంతోపాటు సర్వీస్ బ్రేక్ చేసి వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఆ 123 మందితో పాటు మరో 11 మందిని కలిపి మొత్తం 134 మందికి తాజాగా డీపీఓ వెంకయ్య చార్జ్ మెమో ఇచ్చి వివరణ కోరారు.

### డిసెంబర్, జనవరిలోనే పలువురిపై చర్యలు

జిల్లాలో 864 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. గతేడాది మార్చి నుంచి డిసెంబర్ వరకు కొంత మంది పలు కారణాలతో సెలవు పెట్టి విధులు మానేశారు. వారిలో కొందరు ఆరోగ్య సమస్యలు, మరికొందరు ఇతర ఉద్యోగాలకు ప్రిపరేషన్, తదితర కారణాలతో నెల రోజుల నుంచి 11నెలల వరకు సెలవు పెట్టి వెళ్లారు. వారు 2023 డిసెంబర్, 2024 జనవరిలో రీజాయినింగ్ కోసం వెళ్లగా డిసెంబర్‌లో 24 మందిని, జనవరిలో 11న మరో 99 మందిని మొత్తం 123 మంది సెలవు కాలాన్ని సర్వీస్ బ్రేక్ చేస్తూ కలెక్టర్ త్రిపాఠి ఆర్డర్ ఇచ్చారు. అంతేగాక సెలవు కాలాన్ని బట్టి వారికి సుదూర ప్రాంతాలకు రీ పోస్టింగ్స్ ఇచ్చారు.

### నల్లగొండ జిల్లాలోనే ఎందుకని ప్రశ్న?

నల్లగొండ జిల్లాలో మినహాయిస్తే రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఇలాంటి సర్వీస్ బ్రేక్ చేయకుండా డ్యూటీలు ఇచ్చారని, మరికొన్ని జిల్లాల్లో షోకాజ్ లేదా బదిలీ చేసి పోస్టింగ్ ఇచ్చారని అప్పట్లో కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో ఆరు నెలల్లోపు వచ్చిన వారికి అదే పోస్టింగ్ ఇవ్వగా, అంతకు మించి పెట్టిన వారికి మాత్రం అప్పట్లో స్థాన చలనం చేశారు. అయితే నల్లగొండలోనే ఈ నిబంధన ఎందుకు అని కార్యదర్శుల ఆవేదన. ఇతర ఉద్యోగాలకు ప్రిపరేషన్ కోసం హక్కులేదా, సెలవు పెడితే ఎందుకు ఇవ్వలేదు, పెడితే బదిలీ చేయండి, కానీ సర్వీస్ బ్రేక్ ఎందుకు? అని అప్పట్లో కార్యదర్శులు అధికారులకు తెలిపారు. ఇదిలా ఉండగా తాము పలు కారణాలతో సెలవు కావాలని ఎంపీఓ, డీపీఓలకు లెటర్లు ఇస్తే తీసుకోలేదని, గత్యంతరం లేక రిజిస్టర్ పోస్టు కూడా చేశామని అంటున్నారు.

### నిబంధనల ప్రకారమే చర్యలు : వెంకయ్య, డీపీఓ, నల్లగొండ

ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శి సమాచారం లేకుండా రెండు నెలల నుంచి 11నెలల వరకు సెలవు పేరుతో డ్యూటీ ఎగ్గొట్టారు. ప్రొసీజర్ ప్రకారం 134మందికి అప్పుడు షోకాజ్ ఇచ్చి ఇప్పుడు విచారణ చేయడానికి చార్జీ మెమోలు ఇచ్చాం. నిబంధనల ప్రకారమే విచారణ చేసి చర్యలు తీసుకొని బదిలీ ప్రక్రియ చేస్తాం.

# ఎక్కడికక్కడ అంగన్‌వాడీల అడ్డగింత



సూర్యాపేట పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఐసీడీఎస్ రాష్ట్ర ప్రాజెక్టు అధికారికి మెమోరాండం ఇచ్చేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టులు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. తమ సమస్యలపై శాంతియుతంగా పోరాడుతున్నా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం తగదని అంగన్‌వాడీలు మండిపడ్డారు.

# 'బోరు'న రైతన్న

## వట్టిపోతున్న బోర్లు.. అడుగంటుతున్న బావులు

- పంటను కాపాడుకునేందుకు అరిగోస
- నాలుగైదు బోర్లు వేసినా చుక్క నీరు కరువు
- లక్షలకు లక్షలు ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- ఎండిన పంటలు పశువుల మేతకు..
- జిల్లాలో అధిక శాతం బోర్ల కిందే సాగు
- రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలాలు
- సగటున 11 మీటర్ల లోతుకు పడిపోయిన నీళ్లు

ఎటుచూసినా వట్టిపోయిన బోర్లు, అడుగంటిన బావులు.. నెర్రెలు బారిన నేలలు.. పొట్ట మీద ఎండుతున్న పంటలు.. రైతన్న మొహంలో తన్నుకొస్తున్న దుఃఖం.. ఇవీ యాదాద్రి భువనగిరి జిల్లాలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులు. జిల్లాలో సాగు నీటి కోసం రైతులు అరిగోస తీస్తున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంటలను కాపాడుకునేందుకు నానా యాతన పడుతున్నారు. భూగర్భ జలాలు ఇంకి బోర్లు పోయకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. లక్షలకు లక్షలు పెట్టి బోర్లు వేస్తున్నా చుక్క నీరు పడడం లేదు.

యాదాద్రి భువనగిరి, మార్చి 4 (నమస్తే తెలంగాణ)



ఇక్కడ కనిపిస్తున్న రైతు పేరు బెజ్జింక రాంరెడ్డి. ఊరు మోటకొండూరు మండలంలోని బెజ్జంకి బావి. పంట సాగు కోసం తన పొలంలో ఏడు బోర్లు వేశాడు. అందుకుగానూ రూ.2.50లక్షలకుపైగా ఖర్చు చేశాడు. ప్రస్తుతం భూగర్భ జలాలు పడిపోవడంతో ఒక్క బోరు కూడా నీళ్లు పోయడం లేదు. గతంలో నాలుగు ఎకరాల భూమి పారగా, ఇప్పుడు 10 గుంటలకు కూడా నీళ్లు చాలడం లేదు. తన పొలంతో పాటు మరో ఇద్దరు రైతుల నుంచి కౌలుకు తీసుకున్న 12 ఎకరాల్లో వరి ఎండిపోయింది. దాంతో చేసిదిలేక ఎకరాకు ఏడు వేల రూపాయల లెక్కన గొర్రెల మేతకు వదిలిపెట్టినట్టు రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 11 మీటర్లకు పడిపోయిన పాతాళ గంగ

జిల్లాలో కొన్నేండ్లుగా భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. ఏటా గంగమ్మ పైకి ఉబికి వచ్చింది. నాలుగు నుంచి ఐదు మీటర్ల లోతులోనే నీటి మట్టం ఉండేది. కానీ ఈ ఏడాది చెరువులు, చెక్‌డ్యామ్‌లు ఎండిపోవడంతోపాటు పలు కారణాలతో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. ఫిబ్రవరిలో సగటున 10.95 మీటర్ల కిందకు వెళ్లాయి. గతేడాది కంటే ఈసారి 2.36 మీటర్ల మేర అధికంగా పడిపోయాయి. జిల్లాలోని 17 మండలాల్లో జలమట్టం గణనీయంగా తగ్గిపోయింది. సంస్థాన్ నారాయణపురంలో అత్యధికంగా 23.09 మీటర్ల లోతుకు చేరాయి. ఆత్మకూరు (ఎం)లో 18.18 మీటర్లు, బొమ్మలరామారంలో 14.06, భువనగిరిలో 12.61, రామన్నపేటలో 12.36, బీబీనగర్‌లో 12.31, ఆలేరులో 11.96, తుర్కపల్లిలో 11.76, మోటకొండూరులో 11.36 మీటర్ల దూరాన భూగర్భ జలాలు ఉన్నాయి.

జిల్లా రైతాంగం వ్యవసాయానికి బోర్లు, బావులే ప్రధాన ఆధారం. ప్రస్తుతం భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. కొంత కాలం నుంచి పుష్కలంగా నీళ్లు ఉండడంతో జోరుగా పోసిన బోర్లన్నీ ఎండిపోతున్నాయి. దాంతో చేతికి వచ్చే సమయంలో పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి బోర్లు వేస్తున్నా చుక్క నీరు పడడం లేదు. కొన్నిచోట్ల 700 నుంచి 800 ఫీట్ల లోతుకు తవ్వినా ఫలితం ఉండడం లేదు. ఒక్కో రైతు రెండు నుంచి నాలుగైదు బోర్లు వేస్తున్నా ప్రయోజనం శూన్యం. ఒక్కో బోరుకు రూ.లక్ష దాకా ఖర్చు అవుతున్నది. ఈ లెక్కన రెండు నుంచి లక్షలు లక్షల వరకు వెచ్చిస్తున్నా నీళ్లు పడకపోవడంతో బోరున విలపిస్తున్నారు.

**లక్షలు ఖర్చు చేస్తున్నా చుక్క నీరు కరువు**

చాలామంది రైతులు అప్పులు చేసి మరీ బోర్లు వేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయం అందించకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. మరోవైపు పంటలు ఎండిపోతుండడంతో కుంగిపోతున్నారు. చాలాచోట్ల ఎండుతున్న వరి పైర్లలో పశువులను మేపుతున్నారు. మరికొన్ని చోట్ల రైతులు వాటర్ ట్యాంకర్లతో పొలాలకు నీళ్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.వెయ్యి వరకు ఖర్చు చేస్తున్నారు. ఇలా ఎన్ని ట్యాంకర్లు పోస్తే అన్ని వేలు అవుతున్నాయి. రైతు అవస్థలపై ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని, చెరువులు నింపితే ఇంత దుర్భర పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే సర్కారు పట్టించుకోని మిగిలిన కొద్దిపాటి పంటలైనా కాపాడాలని వేడుకుంటున్నారు.

### ఐదు బోర్లు వేసినా నీళ్లు పడలే


నెర్రెలు వారిన పంట పొలాన్ని చూపుతున్న ఈ యువ రైతు పేరు నాగెల్లి రమేశ్. గుండాల మండల కేంద్రం. రమేశ్ తనకున్న రెండెకరాలతోపాటు మరో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాడు. పంట ఈనె దశలో నీళ్లు అందడం కష్టంగా మారింది. దాంతో అప్పు చేసి 5 బోర్లు వేశాడు. ఒక్క దాంట్లోనూ చుక్క నీరు పడలేదు. నాలుగెకరాల పూర్తిగా ఎండిపోయింది. ప్రభుత్వం నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించి చెరువులు నింపితే ఈ పరిస్థితి ఉండేది కాదని నరేశ్ వాపోతున్నాడు. ఇప్పటికైనా నీళ్లు ఇచ్చి మిగిలిన కొద్దిపాటి పంటలను కాపాడాలని, రైతులను ఆదుకోవాలని కోరుతున్నాడు.



ఆత్మకూరు(ఎం) : మండలంలోని కూరెళ్లలో హన్మంతుల సత్తయ్య అనే రైతు పొలంలో పోస్తున్న బోరు నీళ్లు



గుండాలలో ఎండిపోయిన వరి పంటను చూపుతున్న యువరైతు నాగెల్లి రమేశ్



రామన్నపేట : వెల్లంకి గ్రామానికి చెందిన రైతు పోశబోయిన ఆంజనేయులు నీళ్లు లేక ఎండుతున్న వరి పొలాన్ని ఇలా పశువుల మేతకు వదిపెట్టాడు

### ప్రభుత్వం నీళ్లు ఇస్తుందని ఆశ పడితే పంటంతా ఎండింది

గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన రైతు ఎగమాటి విద్యాసాగర్‌రెడ్డి ఆరెకరాల్లో వరి పెట్టాడు. ప్రభుత్వం నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి నీళ్లు ఇస్తుందని ఆశ పడ్డాడు. తీరా పంట పొట్టకు వచ్చాక భూగర్భజలాలు అడుగంటి బోర్లు నీళ్లు పోయడం బంద్ అయ్యింది. వరి పైరు ఎండిపోతుండడంతో లక్ష రూపాయలు ఖర్చు చేసి మరో 3 బోర్లు వేశారు. ఏ ఒక్క దాంట్లోనూ నీళ్లు పడలేదు. పంట పశువుల మేతకు తప్ప దేనికీ పనికి రాన్నట్టున్నదని విద్యాసాగర్‌రెడ్డి వాపోయాడు. ఇప్పటి వ్యవసాయం పరిస్థితులు చూస్తే దుఃఖం తన్నుకొస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాడు.



# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 113 పరీక్ష కేంద్రాలు.. 58,228 మంది విద్యార్థులు
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎగ్జామ్
- 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతి



యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్స్ వేస్తున్న సిబ్బంది

నల్లగొండ/సూర్యాపేట అర్బన్/భువనగిరి కలెక్టరేట్, మార్చి 4 : ఇంటర్మీయట్ వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభమై ఈ నెల 25 వరకు కొనసాగనున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 113 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 58,228 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. గంట ముందే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని, ఒకవేళ ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తామని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. తొలిరోజు బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులు లాంగ్వేజెస్ పరీక్ష రాయనున్నారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో మంగళవారం ఆయా జిల్లాల కలెక్టర్లు అధికారులతో సమావేశం నిర్వహించారు. పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

### నల్లగొండ జిల్లాలో..

పరీక్షల కోసం జిల్లాలో 52 సెంటర్లను ఏర్పాటు చేయగా 28,722 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

### సూర్యాపేట జిల్లాలో..

పరీక్షల కోసం జిల్లాలో 32 సెంటర్లను ఏర్పాటు చేయగా ఇందులో 12 ప్రభుత్వ, 20 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 16,948 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షల కోసం 32 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 850 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

### యాదాద్రి భువనగిరి జిల్లాలో..

పరీక్షల కోసం జిల్లాలో 29 సెంటర్లను ఏర్పాటు చేయగా 12,558 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఎగ్జామ్ నిర్వహణకు 29 చీఫ్ సూపరింటెండెంట్లు, 29 శాఖల అధికారులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు.

| జిల్లా | పరీక్ష కేంద్రాలు | ప్రథమ సంవత్సరం విద్యార్థులు | ద్వితీయ సంవత్సరం విద్యార్థులు | మొత్తం |
|---|---|---|---|---|
| నల్లగొండ | 52 | 13,992 | 14,730 | 28,722 |
| సూర్యాపేట | 32 | 8,640 | 8,308 | 16,948 |
| యాదాద్రి | 29 | 6,208 | 6,350 | 12,558 |
| మొత్తం | 113 | 28,840 | 29,338 | 58,228 |

# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- భువనగిరి- జగదేవ్‌పూర్ రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళన

భువనగిరి కలెక్టరేట్, మార్చి 4 : వేసవికి ముందే తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. భువనగిరి మండలం హన్మాపురం గ్రామంలోని పెద్దమ్మ కాలనీకి వారం రోజులుగా తాగునీటి సరఫరా సరిగ్గా ఉండడం లేదు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో మంగళవారం సాయంత్రం మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లు, నీళ్ల క్యాన్లతో భువనగిరి-గజ్వేల్ హైవేపై ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి స్పందించి తాగు నీటి సమస్య పరిష్కారానికి భరోసా ఇచ్చే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ భీష్మించారు. పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అవడంతో పోలీసులు వచ్చి ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావుతో హామీ ఇప్పించి ఆందోళన విరమించారు.



తాగునీటి కోసం భువనగిరి- జగదేవ్‌పూర్ రహదారిపై ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలుపుతున్న హన్మాపురం గ్రామ మహిళలు